# ప్రేమికులు



ఎమ్. పార్థసారథి

గోపాలం, గాయత్రీ ప్రేమించుకున్నారు.

సాయంత్రం ఆరుగంటల వేళ. పబ్లిక్ గార్డెన్స్‌లో, విశాలమైన గరిక పచ్చ మైదానంలో, క్రోటన్ చెట్ల చాటున, ఏకాంతంగా ప్రేమసౌధాలు నిర్మించుకుంటున్నారు.

"ఈ రోజు నువ్వు బాగున్నావు."

"అంటే?"

"అంటే మొన్నటికన్నా నిన్న, నిన్నటి కన్నా ఈరోజు బావున్నావని." అది ఆమెను పొగడటం అని అతడి ఉద్దేశం. అతడికి అమ్మాయిమీద యిష్టమైతే వుంది గాని, ఎలా చెప్పాలో తెలియదు. చాలా మంది అతని స్థాయి మనుషుల్లాగే అతడు తెలివిగలవాడేమీ కాదు. ఏదో కాలేజీ, ఉద్యోగం, వారపత్రికలు చదవటం, సినిమాలు చూడటం, త్వరగా నిద్రపోవటం, అప్పుడప్పుడూ సిగరెట్లు కాల్చటం.... తప్ప ప్రత్యేకంగా ప్రేమ సంభాషణ అంటూ అతడికేమీ తెలియదు.

అందువల్ల వాళ్ళ ప్రేమ సంభాషణ చప్పగానే వుంది. అది జనం తిరిగే చోటు కావటంవల్ల వాళ్ళ చేష్టలు సభ్యతను ఒక్క రవ్వకూడా దాటిపోలేదు. కాకపోతే కూర్చున్నప్పుడు వెనక్కూ, పక్కకూ కాస్త పరచుకున్న ఆమె చీర కొంగును ప్రేమికుడు ముట్టుకుని చాలా ఆనందం అనుభవించాడు.

"నాకైతే మా అమ్మ తప్ప యిం కెవరూ లేరు ఆమె ఒప్పుకుంటుందనే నమ్మకంకూడా నాకుంది నీ కభ్యంతరం లేకపోతే మీ పేరెంట్స్‌ను ఎప్పుడు అడగమంటావు? అన్నాడు గోపాలం

గాయత్రి తల వంచుకుంది

ఇదే అదనుగా గోపాలం, ఆమె భుజం తట్టి, "గాయత్రీ, మాట్లాడవేం? ఏమిటి?" అన్నాడు.

"లాభం లేదు గోపాలం. మా అక్కయ్య పెళ్ళైనదాకా నా గురించి నేనేమీ చెప్పలేను."

"సరే. వెయిట్ చేద్దాం. కాని గాయత్రీ, మీ అక్కయ్య ఇన్నాళ్ళు, పెళ్ళిగాకుండా ఎలా వుంది?"

మళ్ళీ గాయత్రి మౌనం వహించ టంతో, గోపాలం, ఆమెపట్ల తనకు గల ప్రేమను గురించి పునర్వ్యాఖ్యానం చేస్తూ.

"ఎన్నేళ్ళు ఆగాల్సి వచ్చినా సరే, నేను నిన్నే చేసుకుంటాను గాయత్రీ. నువ్వు నమ్మకపోవచ్చు గాని, యిది నిజం. నిన్ను చేసుకోలేని పక్షంలో నేను ఆజన్మ బ్రహ్మచారిగానే వుండిపోతాను" అన్నాడు.

ఈసారి గాయత్రి, మోకాళ్ళమీద చేతులూ, చేతుల్లో తలా పెట్టుకుని గోపాలంవైపు చూపింది. ఆమె స్పష్టంగా నవ్వలేదు గాని, ఆమె కళ్ళు సంతోషంగా వున్నట్టుగా అతడి కనిపించింది.

"నువ్వు మాట్లాడవేం, గాయత్రీ!" అన్నాడు గోపాలం.

"మీ కున్నంత స్వాతంత్ర్యం మాకు లేదుగా. నేనేమీ వాగ్దానాలు చేయలేను. కాని నేను బ్రతికుంటే నీ భార్యగానే, వరిపోవటానికూడా అలా అనకు" అంది గాయత్రి

ఇప్పుడు ఆమె మాటల్లో బాధమాత్రమే గాక, ఆమె కనుకొలకులలో నీరుకూడా కనిపించింది గోపాలానికి కాని తన ప్రేమను వ్యక్తపరచటానికి యింకా సన్నిహితమైన చేష్టలేవీ చెయ్యకూడదనే నియమం వుండటంవల్లా, ఆ చేష్టలకు సమానమైన మాటలు తెలియకపోవటం వల్లా అతడు మౌనంగా వున్నాడు.

"నా స్వార్థంకోసం నిన్ను నిరీక్షించ మని చెప్పే అధికారం నాకేమున్నది?" అంది గాయత్రి.

వెంటనే గోపాలం,

"ఈ విషయంలో నీకెంత స్వార్థ మున్నదో, నాకూ అంతే స్వార్థమున్నది" అని రెడీమేడ్ సమాధానం చెప్పేశాడు.

ఇలా, చక్కగా అతికినట్టుగా డైలాగులు చెప్పటం గోపాలానికి చాలా యిష్టం. కాని, చాలాసార్లు అతడు ఈ ప్రయత్నంలో విఫలమవుతుంటాడు.

"చూడు గాయత్రీ, మన ఈ ఆర్నెల్ల పరిచయంలో నా గురించి నీకు కొద్దో గొప్పో తెలిసే వుంటుంది. నువ్వు నన్ను పెళ్ళి చేసుకోవటానికి వొప్పుకున్నావంటే నా గురించి నీకు కొంత మంచి అభి ప్రాయం వుండటంవల్లనే. అలాగే నేను నిన్ను ఒదులుకోదలచటం లేదంటే నీ మీద నాకు ఆరాధనాభావం వుండటం వల్లనే. అటువంటప్పుడు మనం యింక ఎన్నాళ్ళు నిరీక్షిస్తామన్నది ముఖ్యం కాదు. ఆర్నెల్లు - లేదా ఆరేళ్ళు - ఎన్నేళ్ళైనా




సరే నీకోసం నిరీక్షిస్తాను గాయత్రీ. నీకోసం ఏమైనా, ఏ త్యాగమైనా చేస్తాను" అన్నాడు గోపాలం.

ఈలోగా పల్లీలవాడొచ్చాడు. గోపాలం చేత్తోనే వాణ్ణి వెళ్ళిపొమ్మని సైగచేశాడు. గాయత్రి కళ్ళు కిందికి వాల్చుకుని నిశ్శబ్దంగా వింది.

సూర్యుడస్తమించాడు. వెలుగు తగ్గింది. జనం లేచి వెళ్ళిపోతున్నారు.

గోపాలం యిప్పుడు కొత్త సాన్నిహిత్యం అనుభవించాడు. గాయత్రి భుజం మీద చెయ్యివేసి,

"లేద్దామా" అన్నాడు.

"ఊఁ" అంది గాయత్రి.

"కామత్‌లో కాఫీ తాగేసి నెమ్మదిగా వెళ్దాం" అన్నాడు.

"త్వరగా వెళ్ళాలి" అంది గాయత్రి.

అతడి వేళ్ళు ఆమె వేళ్ళతో కలిసి మాట్లాడేయి. ఆమె లేచి చీర సవరించుకుని, కొంగు భుజంమీద సరిచేసుకుని చెప్పులు తొడుక్కునేసరికి, 'పద' అంటో అతడి వేళ్ళు ఆమె నడుమును పలకరించాయి.

"అబ్బ, కాళ్ళు నడవనియ్యటం లేదు కూర్చుంటే తిమ్మిరెక్కినట్టున్నాయి" అన్నది గాయత్రి కుంటుతూ.

"సైన్ ఆఫ్ వీక్‌నెస్. కాసేపు నడి... అదే పోతుంది, పద" అన్నాడు.

పబ్లిక్ గార్డెన్స్ గేట్ దాటి రోడ్డుమీ... కొచ్చారు. ఆమె యింకా కుంటుతూ... వుంది.

"అటువైపు వెళ్దామా?" అంటో రోడ్డు క్రాస్ చెయ్యటానికి నడిచాడు గోపాలం గాయత్రి అతణ్ణనుసరించింది.

ఆకాశంనుండి ఊడిపడ్డట్టుగా ఆర్టీ... బస్సొకటి వాళ్ళవైపు దూసుకుంటూ వచ్చింది.

"గాయత్రీ రా" అంటో ఒక్క అంగలో రోడ్డు కటువైపు గెంతాడు గోపాలం.

భయంతో గాయత్రి ఒక్కడుగుకూడా కదల్లేక పోయింది.

అనుభవజ్ఞుడైన డ్రైవరు సడెన్‌బ్రేకు వేసి ఆమె ప్రాణం కాపాడాడు. ★